

సాక్షి గణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి, జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అక్షర దివిటీ!

గ్రంథాలయం అక్షర దివిటీ వెలిగిస్తోంది. యువత జీవితానికి వెలుగు బాట వేస్తోంది. పుస్తకాల్లోని ప్రతి పేజీ లక్ష్యాన్ని ఏర్పరచడంతో పాటు గెలుపు తీరాలకు చేరుస్తోంది. 8లో▸



పకడ్బందీగా కార్యక్రమాలు

నాబార్డు నిధులతో వివిధ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడంపై దృష్టి సారించాలని డీడీఎం(నాబార్డు) ఎం.సుబ్బారెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

'హంద్రీ'కి జీడీపీ నీరు

కోడుమూరు రూరల్: కోడుమూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు గాజుల దిన్నె ప్రాజెక్టు(జీడీపీ) నుంచి హంద్రీ నదికి నీటి వదిలారు. జీడీపీ ఎడమ కాల్వ ద్వారా బుధవారం 60 క్యూసెక్కుల నీటిని వదలగా.. ఇవి శుద్ధవాగు మీదుగా వర్కూరు హంద్రీనదిలోకి చేరాయి. హంద్రీకి జీడీపీ నీటి విడుదల చేయడంతో కోడుమూరులో నెలకొన్న నీటి సమస్య పరిష్కారమైంది.

రేపు గోనెగండ్లలో 'జగనన్నకు చెబుదాం-స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని ఈ శుక్రవారం గోనెగండ్లలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటరంగారెడ్డి



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ఐదు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలతో కలిపి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెగ్యులర్ సూపరింటెండెంట్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఇప్పటి వరకు ఫుల్ అడిషనల్ చార్జ్(ఎఫ్ఏసీ) సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

91.96 శాతం ఈ-కేవైసీ పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలను ధ్రువీకరిస్తూ రైతులతో ఈ-కేవైసీ చేయించే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. బుధవారం చివరి రోజు కావడంతో ఆర్‌బీకే ఇన్‌చార్జీలు, మండల వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఈ-కేవైసీ 91.96 శాతం పూర్తయింది. 3,10,378 మంది రైతులు 9,27,192 ఎకరాల్లో సాగు చేసిన పంటలకు ఈ-కేవైసీ చేశారు. ఈ-క్రాప్‌లో 10,09,865 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశారు. ఇంకా 82,673 ఎకరాల్లోని పంటలకు ఈ-కేవైసీ చేయించాల్సి ఉంది. సర్వర్ పనిచేస్తున్నంత వరకు రైతులతో ఈ-కేవైసీ చేయించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్‌వరలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-కేవైసీ లేకపోతే ఈ-క్రాప్‌కు ప్రామాణికత ఉండదు. రైతులు ఆర్‌బీకేల్లో బయోమెట్రిక్ వేయడం ద్వారా లేదా ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చని సూచించారు.

చేనేత పట్టుచీరలకు జాతీయ అవార్డు

- ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కింద ప్రిలిమినరీ విభాగంలో ఎంపిక

కర్నూలు(అగ్రికల్చర్): ఒక జిల్లా, ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కింద కర్నూలు జిల్లాకు సంబంధించి చేనేత పట్టుచీర(హ్యాండ్‌లూమ్ సిల్క్‌శారీ) జాతీయ స్థాయి పురస్కారానికి ప్రాథమికంగా ఎంపికైంది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఓడీఓపీ కింద నేషనల్ లెవల్ అవార్డులకు ప్రతిపాదనలను పంపారు. అయితే ప్రిలిమినరీ విభాగంలో 13 జిల్లాలకు సంబంధించి ఉత్పత్తులు ఎంపికయ్యాయి. క్షేత్రస్థాయిలో చేనేత పట్టుచీరల తయారీని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్వెస్ట్ ఇండియా(ఎన్‌జీఓ) ప్రతినిధి హరిప్రీత్‌సింగ్‌ను జిల్లాకు పంపుతోంది. ఈయన ఈ నెల 14న కర్నూలుకు రానున్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు మండలాల్లో తయారవుతున్న చేనేత పట్టుచీరల తయారీని పరిశీలిస్తారు. చేనేతకారులతో ముఖాముఖి మాట్లాడుతారని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నివేదిక ఆధారంగా జాతీయస్థాయి అవార్డు ప్రదానంపై నిర్ణయం ఉంటుందన్నారు. ఇదిలాఉంటే నంద్యాల జిల్లా నుంచి ఆళ్లగడ్డ రాతి చిత్రాలను అవార్డు కోసం ప్రతిపాదించగా ఎంపికకు నోచుకోలేదు.



కర్నూలు జిల్లాలో ఉత్పత్తి అయిన గద్వాల పట్టుచీర

గుండె గూటికి పండుగ



ఓర్వకల్లు జగనన్న కాలనీ వ్యూ

దసరాకు ముందే పేదలకు పెద్ద పండుగ వచ్చింది. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్ల ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి 'ఇంటి' పండుగకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని ఓర్వకల్లు జగనన్న కాలనీని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఎన్నో ఏళ్ల కల సాకారం కావడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేడుకగా గృహ ప్రవేశాలు చేసేందుకు సిద్ధమయ్యారు.



ఓర్వకల్లులోని వైఎస్సార్ జగనన్న కాలనీ ముఖ ద్వారం

- నేడు ఓర్వకల్లులో జగనన్న కాలనీ ప్రారంభం
- సామర్లకోట నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలోని 344 జగనన్న కాలనీల్లో 40,815 ఇళ్ల నిర్మాణం
- ఇప్పటి వరకు పూర్తి అయినవి 15,316
- వేర్వేరు దశల్లో 21,653 గృహ నిర్మాణాలు
- లబ్ధిదారులకు చెల్లించిన మొత్తం రూ.403.43 కోట్లు
- అందుబాటులో స్టీల్, సిమెంట్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పేదల ఇంటి కష్టాలు తొలగాయి. 'నవ రత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ప్రభుత్వమే స్థలాలు కేటాయించి, గృహాలను నిర్మించి ఇచ్చింది. కాలనీలతోపాటు కొత్త ఊర్లను నిర్మించింది. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించింది. రోడ్లను నిర్మించి పేదలకు ఇబ్బందులు లేకుండా చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి ముడి సరుకుతో కలిపి లబ్ధిదారులకు రూ.403.43 కోట్లను చెల్లించింది.

అప్‌లోడ్ చేసిన వెంటనే బిల్లులు

జిల్లాలో మొత్తం 344 వైఎస్సార్ జగనన్న కాలనీల్లోని లేఅవుట్లు, సొంత స్థలాల్లో మొత్తం 40,815 గృహాలు మంజూరయ్యాయి. ఆయా లేవుట్లలో గృహాలను నిర్మించుకునేందుకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడంతో పాటు మౌలిక వసతులు కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కల్పించింది. ఆయా కాలనీలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.20.10 కోట్లు వెచ్చించి 337 కాలనీల్లో నీటి వసతి కల్పించారు. అలాగే 175 కాలనీల్లో విద్యుదీకరణ పూర్తి చేశారు. గృహ నిర్మాణ బిల్లులను అప్‌లోడ్ చేసిన నాలుగైదు రోజులకే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. ఆయా లేవుట్లలో లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఆదోని, కర్నూలు డివిజన్లలో రూ.1.75 కోట్లతో 30 అప్రోచ్ రోడ్ల పనులుచేపట్టారు. ఆదోని డివిజన్‌లో రూ.18 లక్షలతో భూమి చదును, రూ.10 లక్షలతో సిమెంట్ గోడౌన్ల నిర్మాణం పూర్తయ్యాయి. థర్డ్ ఆప్షన్ కింద కాంట్రాక్టర్లు 11,110 గృహాలను మ్యాపింగ్ చేయగా, 8,749 గృహ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

రూ.83.23 కోట్ల ఆర్థిక చేయూత

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు మొత్తం 23,781 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం రూ.83.23 కోట్లను రుణంగా అందించారు. గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడు ఈ మొత్తం కూడా వారికి అందడంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు కూడా గృహ నిర్మాణాల్లో బిజీ అయిపోయారు.

నేడు ఓర్వకల్లులో వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా నేడు (గురువారం) జిల్లాకొక వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రారంభం కానుంది. కాకినాడ జిల్లా సామర్లకోటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీని ప్రారంభించి అక్కడి నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక్కో కాలనీని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు సమీపంలో జగనన్న కాలనీని కూడా ప్రారంభించనున్నారు. ఈ కాలనీలో మొత్తం 260 గృహ నిర్మాణాలకు గాను ఇప్పటి వరకు 72 పూర్తయ్యాయి. వేర్వేరు దశల్లో 185 గృహాలు ఉన్నాయి. మూడు గృహ నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఈ కాలనీలో రూ.40.50 లక్షలతో నీటి వసతి, రూ.46 లక్షలతో అంతర్గత రోడ్లు, రూ.40 లక్షలతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. అలాగే రూ.7.50 లక్షలు వెచ్చించి వైఎస్సార్ జగనన్న కాలనీ ముఖ ద్వారాన్ని నిర్మించారు.

లబ్ధిదారులకు అందించిన సిమెంట్, స్టీల్ (టన్నుల్లో)

ముడి సరుకు	దిగుమతి	లబ్ధిదారులకు ఇచ్చినది	గోడౌన్లలో ఉన్నది
సిమెంట్	40,663	37,016	3,647
స్టీల్	5,440	4,077	1,363

వచ్చే వారానికి 100 శాతం గ్రౌండింగ్

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో హౌసింగ్‌కు సంబంధించి గ్రౌండింగ్ శాతం 82గా ఉందని, వచ్చే వారానికి 100 శాతానికి తీసుకురావాలని మండలాధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆప్షన్ 1,2,3 కింద బిలో బేస్మెంట్ లెవల్‌లో 5,400 ఇళ్లు ఉన్నాయని, వాటిని పదిరోజుల్లో బేస్మెంట్ లెవల్‌కు తీసుకురావాలన్నారు. హాలహర్వి, చిప్పగిరి, కౌతాళం, తుగ్గలి మండలాల్లో గ్రౌండింగ్ శాతం 75 కంటే తక్కువగా ఉందన్నారు. చిప్పగిరి, ఆదోని మండలాల్లో స్టేజ్ కన్వర్షన్‌లో పురోగతి కన్పించాలన్నారు. జగనన్న సురక్షకు సంబంధించి ఓపీ శాతాన్ని పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను, రీసర్వే సర్వే పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. రీసర్వేకు సంబంధించి పెండింగ్‌లోని స్టోన్ ప్లాంటేషన్‌ను శనివారంలోపు పూర్తి చేయించాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదును ఆదేశించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీని సిద్ధలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆదోని మండలం ధనాపురం గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు

మంజూరైన మొత్తం గృహాలు	40,815
జిల్లాలో మొత్తం జగనన్న కాలనీలు	344
లేఅవుట్లలో నిర్మిస్తున్న గృహాలు	21,477
సొంత స్థలాల్లో నిర్మిస్తున్న గృహాలు	19,338
పూర్తి అయినవి	15,316
రూఫ్ కాస్ట్, రూఫ్ లెవెల్‌లో ఉన్నవి	3,355
వేర్వేరు దశల్లో ఉన్నవి	21,653



ఓర్వకల్లు జగనన్న కాలనీలో పేదలు నిర్మించుకున్న గృహం



అద్దె ఇంటి బాధ తప్పింది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని అద్దె ఇంటి బాధ తప్పిపోయి సొంతంగా ఇంటిని నిర్మించుకున్నాం. ప్రభుత్వం ఇంటి స్థలాన్ని కేటాయించడంతో పాటు గృహాన్ని కూడా మంజూరు చేసింది. ఇప్పటి వరకు అద్దె ఇంట్లో ఉన్న మేం ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు, పొదుపు రుణం రూ.35 వేలతో పాటు సొంతంగా కొంత మొత్తాన్ని వెచ్చించి ఇంటిని నిర్మించుకున్నాం. మాలాంటి పేద, మధ్య తరగతి వర్గాలకు జగనన్న చేస్తున్న మేలును ఎన్నటికీ మరచిపోలేం.

– కురువ వెంకటేశ్వరి, ఓర్వకల్లు



సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

కుటుంబం పెద్దదైంది. గ్రామంలో ఉన్న ఇల్లు చిన్నదై పోయింది. ఇద్దరు కొడుకులు, కోడళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లతో చిన్న ఇంటిలో నివాసం కష్టమైంది. జగనన్న రూపంలో దేవుడు ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించారు. గ్రామంలో ఇద్దరు కొడుకులు ఉంటే జగనన్న కాలనీల్లో నేను. నా భర్త నివాసం ఉంటున్నాం. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలను విడుదల చేసింది. మా సంతోషానికి కారణమైన జగనన్నకు రుణపడి ఉంటాం.

– పుట్టపాశం బాలమ్మ, ఓర్వకల్లు



అన్ని ఏర్పాట్లు పూర్తి

ఓర్వకల్లు సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో, సొంత స్థలాల్లోను ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాం. ఆయా కాలనీల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నాయి. లబ్ధిదారుల అవసరాల మేర ఆయా గోడౌన్లలో సిమెంట్, ఇసుక, స్టీల్‌ను అందుబాటులో ఉంచాం. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఒక్కొక్కరికి రూ.30 వేల ప్రకారం రూ.83.20 కోట్లను రుణంగా అందించాం.

– ఎం సిద్ధలింగమూర్తి, హౌసింగ్ పీడీ, కర్నూలు

'పరీక్ష' నిధులు.. తేలని లెక్కలు!

- 2022–23లో 'పది' పరీక్షల నిర్వహణకు రూ.1.99 కోట్లు
- చాలా మంది ఇన్విజిలేటర్లకు, ఇతర సిబ్బందికి అందని రెమ్యూనరేషన్
- ఇప్పటివరకు రూ.16 లక్షలకే బిల్లులు చూపిన వైనం
- డీఈఓ కార్యాలయంలో విచారణ జరుపుతున్న ట్రెజరీ అధికారులు



పరీక్షల విభాగం అధికారులతో చర్చిస్తున్న ట్రెజరీ అధికారులు



ప్రభుత్వ పరీక్షల విభాగం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఇచ్చిన నిధులకు సంబంధించిన ఖర్చుల లెక్కలు తేలడం లేదు. ఈ డబ్బులు ఎక్కడికి పోయాయి? ఎందుకు ఖర్చు చేశారో చెప్పాలని ట్రెజరీ అధికారులు 20 రోజులుగా డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ విచారణ జరుపుతున్నారు. అయితే ఈ వ్యవహారంలో తమకు సంబంధం లేదంటూ విద్యాశాఖ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, జూన్ నెలలో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు , ఇతర సిబ్బంది రెమ్యూనరేషన్, టీఏ, డీఏ, కన్వెన్స్ చార్జీలకు రూ.1.99 కోట్లు పరీక్షల విభాగం మంజూరు చేసింది. ఈ నిధుల్లో నుంచి జనవరి 23న రూ.7.80 లక్షలు, మార్చి 1న రూ.19.52 లక్షలు, మార్చి 18న రూ.5.90 లక్షలు, రూ.18.52 లక్షలు, మార్చి 29న 1.59 లక్షలు, రూ.1.50 లక్షలు, జూన్ 6న రూ.14.64 లక్షలు, రూ.8.08 లక్షలు డ్రా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు ఖాతా నుంచి సుమారుగా 8 సార్లు రూ.5 నుంచి రూ.6.5 లక్షల నగదును చెక్ రూపంలో కాకుండా నేరుగా డ్రా చేశారు. నిబంధనల ప్రకారం రూ.5 వేలకు మించితే చెక్కు ద్వారా మాత్రమే డ్రా చేయాలి. అయితే పరీక్షల విభాగం అధికారులు మాత్రం నేరుగా నగదును డ్రా చేశారు. మొత్తంగా రూ.77,55,000కు గాను రూ.16 లక్షలకు మాత్రమే ఇప్పటి వరకు లెక్కలు తేలినట్లు తెలుస్తోంది. మిగిలిన రూ.61.50 లక్షలు ఏమైనట్లు అర్థం కాకపోవడంతో ట్రెజరీ అధికారులు విచారణ జరుపుతున్నారు. డ్రా చేసిన వాటికి రెమ్యూనరేషన్, డీఏ,టీఏ, కన్వెన్సనల్ చార్జీలకు మినహా మిగిలిన వాటికి జీఎస్టీతో కూడిన బిల్లులు లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా పరీక్షల నిర్వహణకు నిధులు తక్కువ కాకూడదనే ఉద్దేశంతో ఏప్రిల్ 12న పరీక్షల విభాగం డైరెక్టర్ మరో శాఖ నుంచి రూ.22,72,000 జిల్లా పరీక్షల విభాగం ఖాతాల్లో జమ చేశారు. అయితే ఇంత వరకు ఆ నగదు జమ అయిన విషయాన్ని కూడా అధికారులు గుర్తించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిపై డీఈఓ చర్యలు తీసుకోవాలని ట్రెజరీ అధికారులు సూచించినా పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

కొంత మందికి అదనంగా జమ చేశాం

పదో తరగతి పరీక్షల నిర్వహణ నిధులు ఎక్కడా దుర్వినియోగం కాలేదు. కొంత మందికి చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ కంటే అదనంగా జమ చేయడంతోనే సమస్య వచ్చింది. నేటి(గురువారం)లోపు అన్ని లెక్కలు సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ కూడా ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోలేదు. కొంత అమౌంట్ రికవరీ చేసి లెక్క సరి చేయనున్నాం.

– వి. రంగారెడ్డి, డీఈఓ

ఈ నెల 15 నుంచి శనగ సాగుకు అదును

- నవంబర్ 15 వరకు విత్తుకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): శనగ సాగు రబీలో నల్లరేగడి నేలల్లోనే సాగవుతుంది. సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలు మినహా అక్టోబర్‌లో ఇప్పటి వరకు వర్షాలు లేవు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల భూముల్లో తేమ శాతం తగ్గిపోయింది. పొడి భూముల్లో శనగ విత్తనం విత్తుకోవద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. శనగ సాగుకు ఈనెల 15 నుంచే చక్కటి అదునుగా వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సాలురెడ్డి తెలిపారు. నవంబర్ 15 వరకు శనగ సాగుకు అవకాశం ఉందన్నారు.

➡ శనగ పంట బాగా రావాలంటే చలి తీవ్రత ఎంతో అవసరం.

➡ ముందస్తుగా శనగ వేసుకుంటే చలి ప్రభావం లేకపోవడం వల్ల పంట ఆశించిన విధంగా ఉండే అవకాశం లేదు.

➡ నేలలో తగిన తేమ ఉన్నప్పుడే విత్తనం వేసుకోవాలి.

➡ ఈ నెల 15 తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

➡ కనీసం 5 ఇంచుల లోతులో విత్తనం పడితే మొలక బాగా వస్తుంది.

➡ కాగా శనగ విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. ఇప్పటి వరకు 21,056 మంది రైతులు 23,245 క్వింటాళ్ల విత్తనాలు 40 శాతం సబ్సిడీపై తీసుకున్నారు.

➡ 28,891 మంది రైతులు 39,416 క్వింటాళ్లకు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

క్వింటా మిర్చి రూ.23,100

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి మార్కెట్‌లో ఎండు మిర్చి ధర స్థిరంగా కొనసాగుతోంది. బుధవారం మార్కెట్‌లో సూపర్-10 జనరల్ రకం మిర్చి గరిష్ట ధర క్వింటా రూ.23,100, కనిష్ట ధర రూ.19,800, మోడల్ ధర రూ.21,500 పలికింది. ఇక ఇదే రకం తాలు కాయ క్వింటా గరిష్ట ధర రూ.11,600, కనిష్ట ధర రూ.10,500 పలికినట్లు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు.

కర్రల సమరంపై ప్రజల్లో మార్పు తేవాలి

- బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన



హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): బన్ని ఉత్సవాల్లో కర్రల సమరం జరగకుండా ప్రజల్లో మార్పు తీసుకురావాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బన్ని ఉత్సవాలపై వివిధ శాఖల అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు హొళగుంద మండలం దేవరగట్టులో మాల మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాలు జరుగనున్నాయన్నారు. ఈ ఉత్సవాలకు 80 వేల నుంచి లక్షన్నర మంది హాజరు కానున్నారని, అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. అక్టోబర్ 24న బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా జరిపేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవరగట్టులో అన్ని వసతులతో కూడిన తాత్కాలిక ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. నాటు సారాను అరికట్టాలని ఆదేశించారు. ఉత్సవాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరాతోపాటు జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని ఎపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. భారీ లైటింగ్‌తోపాటు బారికేడ్లను ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను కల్పించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో, ఆరోగ్య సిబ్బంది అంబులెన్స్‌లతో సిద్ధంగా ఉండాలన్నారు. స్వామి ఆలయం వరకు రోడ్లను మరమ్మతు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ..బన్ని ఉత్సవాలకు అధిక సంఖ్యలో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్వో కె. మధుసూదనరావు, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాస్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, డీపీఓ నాగరాజునాయుడు పాల్గొన్నారు.

ఎడమగట్టు కేంద్రంలో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో ముమ్మరంగా విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. మంగళవారం నుంచి బుధవారం వరకు 11.633 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. అనంతరం నాగార్జున సాగర్‌కు 23,797 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 4,042 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,590 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయానికి ఎటువంటి వరద ప్రవాహం లేనప్పటికీ దిగువ ప్రాంతాలకు 31,181 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 82.3854 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యామ్ నీటిమట్టం 851.10 అడుగులకు చేరుకుంది.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన ఏపీఆర్ఎస్‌ఏ నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : ఏపీఆర్ఎస్‌ఏ నాయకులు బుధవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఏపీఆర్ఎస్‌ఏ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో జిల్లాకు చెందిన ఎం.వెంకటరాజు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గిరికుమార్‌రెడ్డి, నాగరాజు కలెక్టర్‌కు పరిచయం చేసి ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. కాగా, ఆమె రాష్ట్ర కార్యవర్గ సెక్రటరీగా ఎంపికైన వెంకటరాజును అభినందించారు.

ఒక సబ్జెక్టు ఫెయిలైన డిగ్రీ విద్యార్థులకు మరో అవకాశం

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2020–23లో రెగ్యులర్‌గా డిగ్రీ చదివి, ఒక సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులు తక్షణమే పరీక్ష రాసుకోవడానికి వర్సిటీ మరో అవకాశం కల్పిస్తోందని వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు తెలిపారు. ఒకటి నుంచి 4వ సెమిస్టర్ వరకు అన్నీ సబ్జెక్టులు పాసై ఉండి 5 లేదా 6వ సెమిస్టర్‌లో ఒక థియరీ సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆయా కళాశాలల్లో ఈ నెల 14వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. కర్నూలులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, నంద్యాలలోని పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వీసీ ఆనందరావు వెల్లడించారు.

కసాపురం ఈవోగా గురుప్రసాద్



కర్నూలు కల్చరల్: అనంతపురం జిల్లా కసాపురం ఆంజనేయ స్వామి ఆలయం ఈవోగా దేవదాయ శాఖ కర్నూలు జోన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కసాపురం ఎఫ్ఏసీ ఈవోగా ఉన్న వెంకటేశ్వరరెడ్డిని ఆ బాధ్యతల నుంచి తొలగించి గురుప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్షర దివిటీ!

"మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది.. ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థమందులో ఉంది.. అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది... " ఈ సినీ గేయంలోని ప్రతి అక్షరం ఓ జీవిత పాఠం. విద్యార్థిగా ఉన్న సమయం నుంచి ఉపాధ్యాయులు, ఆ తర్వాత అధ్యాపకులు తమ జ్ఞానాన్ని పంచి విద్యార్థి బంగారు భవితకు బాటలు వేస్తారు. తల్లిదండ్రులు తమ స్వేదం చిందించి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తారు. ఒక వయస్సుకు వచ్చిన తర్వాత దారీతెన్ను తెలియని పరిస్థితుల్లో గ్రంథాలయం అక్షర దివిటీ వెలిగిస్తుంది. అక్కడి నిశ్శబ్దం జీవితానికి వెలుగు బాట వేస్తుంది. వేల సంఖ్యలోని పుస్తకాల్లోని ప్రతి పేజీ లక్ష్యాన్ని ఏర్పరచడంతో పాటు గెలుపు తీరాలకు చేరుస్తుంది. పరిచయం లేకపోయినా ఒకరికొకరు స్ఫూర్తిగా నిలుస్తూ.. గంటలకొద్దీ సమయం క్షణాల్లా గడిచిపోతుంది. నిత్య విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తోంది.

- సాక్షి, కర్నూలు డెస్క్

స్ఫూర్తి నిలయం.. గ్రంథాలయం

- జీవితాలను తీర్చిదిద్దుతున్న నిశ్శబ్దం
- అలవడుతున్న ఏకాగ్రత
- ఉద్యోగాలు సాధిస్తున్న యువత
- నిత్య విద్యార్థులుగా పుస్తకాలతో స్నేహం
- మలి వయస్సులో పత్రికల తోడు

ఏకాగ్రత కుదురుతుంది



నాకు ఏడేళ్లుగా లైబ్రరీతో అనుబంధం ఉంది. ఇక్కడకు రావడంతోనే ఉద్యోగం సాధించే అవకాశం దక్కింది. ఇతర వ్యాపకాలకు దూరంగా అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఈ దేవాలయం ఒక వరమని చెప్పాలి. అవసరమైన సమాచారం దొరకడంతో పాటు ప్రతి ఒక్కరూ ఇతరులను చూసి స్ఫూర్తి పొందుతుంటారు. ప్రశాంతమైన వాతావరణం కావడంతో ఏకాగ్రత కుదురుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరో 10వ తరగతి, మరొకరు 7వ తరగతి చదువుతున్నారు. సెలవు రోజుల్లో వాళ్లను తప్పకుండా ఇక్కడికి తీసుకొస్తా. పిల్లలను లైబ్రరీకి అలవాటు చేయడం వల్ల మానసికంగా దృఢంగా ఉంటారు.

– సునీత, జూనియర్ అసిస్టెంట్, ఖజానా శాఖ, కర్నూలు

తప్పక విజయం సాధిస్తా



బి.కాం పూర్తయింది. ఉద్యోగ అన్వేషణలో ఉన్నా. కోచింగ్ సెంటర్లకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఆరేళ్లుగా లైబ్రరీకి వస్తున్నా. ఇక్కడైతే కోరుకున్న సమాచారం, అవసరమైన పుస్తకాలు, అంతకు మించి సమయం అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఎస్ఐ పరీక్షలకు సిద్ధమవుతున్నా. తప్పక విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

– పి.నజీర్, హోసూరు గ్రామం, పత్తికొండ మండలం

ఎంతో ప్రభావితం చేస్తుంది



ఫార్మసీ పూర్తయింది. గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నా. ఐదేళ్లుగా ఇక్కడకు వస్తున్నా. లైబ్రరీకి వచ్చినప్పటి నుంచి నాలో ఎంతో మార్పు వచ్చింది. చుట్టుపక్క వాళ్లను చూస్తే మనం కూడా బాగా చదవాలనే ఉత్సాహం కలుగుతుంది. ఇక్కడికి వచ్చే వాళ్లు ఎంతో మంది మంచి ఉద్యోగాలు సాధించారు. వాళ్లలో కొందరు ఇప్పటికీ రోజూ వచ్చి పోతుండటం చూస్తే లైబ్రరీ ఎంతగా వాళ్లను ప్రభావితం చేసిందో అర్థమవుతుంది. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు చక్కటి అవకాశంగా భావిస్తున్నా.

– శ్వేత, కర్నూలు



విజ్ఞాన నిధి: గ్రంథాలయంలోని పుస్తకాలు



స్ఫూర్తి: గ్రంథాలయంలోని నిశ్శబ్ద వాతావరణంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయింది. అవసరం ఉన్నా, లేకపోయినా ఈ వస్తువు లేనిదే పూట గడవని పరిస్థితి. చివరకు చిన్న పిల్లలకు భోజనం తినిపించాలన్నా సెల్‌ఫోన్‌లో బొమ్మలు పెడితే కానీ ముద్ద దిగనంతగా ప్రభావితం చేస్తోంది. కొంత వరకు తెలియని విషయాలు తెలుసుకునేందుకు ఈ సాధనం ఉపయోగపడుతున్నా.. ఇది లేనిదే బతకలేమన్నంతగా జీవితంలో ఇమిడిపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పరిస్థితుల్లోనూ గ్రంథాలయాలు మనుగడ సాగిస్తున్నాయి. ఎన్నో జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా ఎంతో మంది రోజూ ఇక్కడికి వచ్చి వెళ్తుండటం చూస్తే ఈ భవనం అక్షర యజ్ఞాన్ని తలపిస్తుంది. మొబైల్ ఫోన్లు వచ్చినా, ట్యాబ్‌లు అందుబాటులో ఉన్నా.. ల్యాప్‌ట్యాప్‌లు రాజ్యమేలుతున్నా.. పుస్తకం చేతిలో ఉంటే వంద మంది తోడుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. పేజీలు తిప్పిన కొద్దీ కొత్త జీవితం మొదలవుతుంది.

నిత్య విద్యార్థులు

ప్రపంచం చేతిలో ఇమిడిపోతున్నా తెలియని విషయాలు ఎన్నో ఉంటున్నాయి. నిత్య విద్యార్థిగా మారినప్పుడే జ్ఞానం పెంపొందుతుంది. ప్రస్తుతం గ్రంథాలయానికి వస్తున్న వాళ్లను పరిశీలిస్తే బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంఏ బీఎడ్, ఎంపెడ్, ఎంటెక్.. ఇలా ఉన్నత చదువులు చదివినా ఇప్పటికీ పుస్తకాలతో కుస్తీ పడుతూనే ఉన్నారు. వీళ్లే కాదు.. ఇంటర్మీడియట్, ఆ కింది చదువుల విద్యార్థులు సైతం ఇక్కడికి వచ్చి చక్కగా చదువుకుంటున్నారు. తమకంటే పెద్దవాళ్లు కుదురుగా కూర్చొని పుస్తకాల్లో దూరిపోవడం చూసి మనం కూడా ఆస్థాయికి చేరుకోవాలనే భావన పెంపొందించుకుంటున్నారు.



కర్నూలులోని కేంద్ర గ్రంథాలయం

స్ఫూర్తికి ప్రోత్సాహం

ఎన్ని మార్కులు తెచ్చుకున్నా, ఎంత చదువులు చదివినా ఇంట్లో కూర్చుని పుస్తకాలు తిరగేస్తే ఏదో ఒక ఆటంకం ఎదురవుతూనే ఉంటుంది. ఎవరో ఒకరు మాట్లాడించడం, ఏదో ఒక పని చెప్పడంతో ఏకాగ్రత లోపిస్తుంది. ఈ కారణంగా కూడా చాలా మంది గ్రంథాలయానికి చేరుకుంటున్నారు. ఉదయం 8 గంటలకు తలుపులు తెరవక మునుపే అక్కడ చేతిలో పుస్తకాలతో వాలిపోతున్నారు. రాత్రి 8 గంటలకు తలుపులు మూసేస్తున్నా.. మరికొంత సమయం తీసుకొని పేజీలు తిప్పేస్తున్న తీరు ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఇలాంటి వాళ్లను గ్రంథాలయ నిర్వాహకులు కూడా ప్రోత్సహిస్తున్నారు.

ప్రశాంతతను వెతుక్కుంటూ..

విద్యార్థులే కాదు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సైతం గ్రంథాలయానికి నిత్య విద్యార్థులుగా వస్తుండటం విశేషం. ఇక్కడికి రావడమే కాదు.. ముఖద్వారంలో ఏర్పాటు చేసిన ఓ పుస్తకంలో తమ పేరు, వివరాలను రాస్తుండటం చూస్తే క్రమశిక్షణకు అద్దం పడుతోంది. ఇక్కడ సుమారు 15 వరకు దినపత్రికలను అందుబాటులో ఉంచడంతో ప్రతి రోజూ 120 నుంచి 140 మంది వరకు ప్రపంచాన్ని చుట్టివచ్చినట్లుగా అక్షరం అక్షరాన్ని వడబోస్తున్నారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న వాళ్లు శేష జీవితంలో ప్రశాంతతను వెతుక్కుంటూ పుస్తకాలతో స్నేహం చేస్తున్నారు. ప్రతి రోజూ ఈ గడప తొక్కనిదే తమకు ఏమీ తోచదని చెప్పడం చూస్తే ఈ పుస్తకాలు వాళ్ల జీవితంలో ఎలా భాగమయ్యాయో అర్థమవుతుంది. అంతేకాదు.. కొందరు దాతలు తాము ఎంతో ప్రేమగా దాచుకున్న పుస్తకాలను విరాళంగా ఇచ్చి పుస్తక ప్రియులకు ప్రోత్సహిస్తున్నారు. అంధులను దృష్టిలో ఉంచుకొని ఓ గదిని ప్రత్యేకంగా తీర్చిదిద్దడంతో పాటు బ్రెయిలీ లిపిలోని భారతం కూడా అందుబాటులో ఉంచారు.

శాశ్వత సభ్యత్వం రూ.100

ప్రస్తుతం గ్రంథాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలను బయట కొందరు వ్యాపార ధోరణిగా కూడా మలుచుకున్నారు. ఒక భవనాన్ని అద్దెకు తీసుకొని కొన్ని కంప్యూటర్లు, కుర్చీలు ఏర్పాటు చేసి చదువుకునే ఏర్పాటు చేసి నెలకు సుమారు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. వైఫై సౌకర్యం కల్పించేందుకు మరికొంత అదనపు డబ్బు తీసుకుంటున్నారు. అయితే ఇలాంటి సౌకర్యాలన్నీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసినా ఇక్కడ శాశ్వత సభ్యత్వంగా రూ.100 మాత్రమే తీసుకుంటున్నారు. పని చేస్తున్న ఉద్యోగులంతా మానవతా దృక్పథంతో ఉన్నవారే కావడం, ఉద్యోగాలు వస్తే జీవితంలో స్థిరపడతారనే భావన ఉండటంతో తమ పిల్లలుగానే ప్రోత్సహిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణం ఉండటం, సెల్‌ఫోన్‌లను ప్రోత్సహించకపోవడంతో విద్యార్థులు తమ లక్ష్యంపైనే దృష్టి సారిస్తున్నారు.

పుస్తకం పట్టనిదే పూట గడవదు

ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కనిపిస్తున్నా, గ్రంథాలయానికి వచ్చే వాళ్లు పుస్తకం పట్టనిదే పూట గడవని విధంగా తమను తాము మలుచుకున్నారు. ఒకప్పుడు కొత్త నవల మార్కెట్‌లోకి వచ్చీ రాగానే అమ్ముడైపోయేవి. అయితే ఇప్పటికీ గ్రంథాలయంలో లభిస్తున్న నవలలు, వీక్లీలు, ఇతరత్రా పుస్తకాలను శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్యులు ఇళ్లకు తీసుకెళ్లి చదువుతున్నారు. ఖరీదైన పుస్తకాలను కాస్త డబ్బు డిపాజిట్ చేసి తీసుకెళ్తున్నారు. ఇక ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులు మధ్యాహ్నానికి అవసరమైన భోజనం కూడా తెచ్చుకొని ఇక్కడి పుస్తకాలతో పాటు తమ వెంట తెచ్చుకున్న పుస్తకాలను అవపోసన పడుతున్నారు. అవసరమైన సమాచార సేకరణకు కంప్యూటర్లు కూడా ఉండటంతో ఎంతో ఉత్సాహం కనపరుస్తున్నారు. గంటకు రూ.10 చొప్పున మాత్రమే కంప్యూటర్ వినియోగానికి వసూలు చేస్తుండటం విశేషం.

అందుబాటులోని పుస్తకాలు	54,986
శాశ్వత సభ్యత్వం సభ్యులు	13,809
లభించే పత్రికల సంఖ్య	15
ప్రతి రోజూ వచ్చి వెళ్లే సభ్యులు	230
ఇటీవల కాలంలో ఉద్యోగాలు సాధించిన వారి సంఖ్య	78
ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి సంఖ్య	112



క్రమశిక్షణ: వివరాలు నమోదు చేస్తున్న పాఠకుడు



బాధ్యత: బ్రెయిలీ లిపి భారతం పుస్తకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క



విజయం: ఇటీవల కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన రాఘవేణి, వసంత

కుక్క అడ్డు రావడంతో..

- రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం



ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడివున్న సీహెచ్ పుల్లయ్య

పాణ్యం: కుక్క అడ్డు రావడంతో బైకిస్ట్ దుర్మరణం చెందిన ఘటన మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు.. నందికొట్కూరుకు చెందిన బొల్లవరం సీహెచ్ పుల్లయ్య(43) గోరుకల్లు–ప్యాపిలి వరకు పైపులైన్ పనులు చేస్తున్న మెగా కంపెనీలో డీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై పాణ్యంకు బయలుదేరాడు. ఎస్సార్బీసీ కాల్వ వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ నుంచి కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. హైవే సిబ్బంది అక్కడికి చేరుకుని శాంతిరాం ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

పకడ్బందీగా నాబార్డు కార్యక్రమాలు

- నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): నాబార్డు నిధులతో వివిధ కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేయడంపై దృష్టి సారించాలని డీడీఎం(నాబార్డు) ఎం.సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం కర్నూలులోని ప్రైమ్ హోటల్ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఎం మాట్లాడుతూ... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నాబార్డు ఎంతో కృషి చేస్తోందన్నారు. రైతుల అభ్యున్నతికి కూడా నాబార్డు తోడ్పడుతుందని పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిగే ఉపయోగాలను వివరించారు. సంఘాలు మరింత సమర్థవంతంగా రాణించేందుకు బ్యాంకులు రుణాలు కూడా ఇస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ...

ప్రభుత్వం జిల్లాలోని టమాట, ఉల్లి రైతులకు మేలు చేసే విధంగా సోలార్ డ్రైయర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. సోలార్ డ్రైయర్లకు అవసరమైన టమాట, ఉల్లిని రైతు ఉత్పత్తిదారులు సరఫరా చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. ప్రియారిటీ, నాన్ ప్రియారిటీ రుణాల పంపిణీ గురించి ఎల్‌డీఎం రామచంద్రరావు అవగాహన కల్పించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు బ్యాంకులు రుణాలు ఇస్తాయని, బ్యాంకుల్లో ఏవైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆపార్డు సంస్థ సీఈవో తిరుపతిరెడ్డి, ఎస్4ఎస్ సంస్థ సిబ్బంది, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

శిశువును కొరికి చంపిన తల్లిపై కేసు నమోదు

బొమ్మలసత్రం: ఈ నెల 10న నవ జాత శిశువు మెడ కొరికి హత్య చేసిన తల్లి షానుబీపై త్రీటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ నరసింహులు తెలిపిన వివరాలు.. షానుబీ మూడేళ్ల క్రితం మహేష్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. మొదటి కాన్పులో ఆడ శిశువుకు జన్మనివ్వగా వారం రోజులకే మృతిచెందింది. 18 రోజుల క్రితం రెండవ కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈక్రమంలో మంగళవారం షానుబీ, మహేష్‌ల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. తర్వాత భర్త ఇంట్లో నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లిపోయాడు. అత్త, మామలు కూడా సాయంత్రం ఐదు గంటలకు ఆసుపత్రికి వెళ్లారు. ఈసమయంలో షానుబీ తన కుమారుడి మెడ కొరికి హత్య చేసింది. కాసేపటికి అత్త, మామ ఇంటికి రాగా ఫిట్స్ వచ్చినట్లు నాటకమాడింది. మామ ఫిర్యాదు మేరకు షానుబీపై హత్య కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ప్రతి రైతుకూ విత్తనాలు అందాలి



సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అడిగిన ప్రతి రైతుకూ విత్తనాలు అందించాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులకు సూచించారు. ఏ ఒక్క రైతు కూడా తనకు విత్తనాలు అందలేదనే మాటే వినిపించరాదన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటోందదన్నారు. గతంలో సబ్సిడీ 30 శాతం ఉండగా ప్రస్తుతం 40 శాతంతో అందిస్తుందన్నారు. ఆర్బీకేల్లో వివిధ మ్యాగజైన్లను అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 28 వేల క్వింటాళ్లు మంజూరు కాగా, కోవెలకుంట్ల ఏడీఏ పరిధిలోని రైతులకు 15 వేల క్వింటాళ్లు కేటాయించామన్నారు. టీడీపీ పాలనలో రైతులు విత్తనాల కోసం తీవ్ర అగచాట్లు పడేవారని జెడ్పీ చైర్మన్ గుర్తు చేశారు. గతానికీ ఇప్పటికీ రైతులు తేడాను గమనించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, ఏఓ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

వన్యప్రాణి వేట కేసులో బాలుడి అరెస్టు

- తుపాకీ, ద్విచక్రవాహనం స్వాధీనం

ఆత్మకూరు రూరల్: బైర్లూటి రేంజ్ పరిధిలోని వెంకటాపురం బీట్ పరిధిలో ఉన్న అడవిలో మంగళవారం రాత్రి పదిహేనేళ్ల బాలుడు వేట సామగ్రితో అటవీ అధికారులకు పట్టుబడ్డాడు. బైర్లూటి ఎఫ్ఆర్ఓ దొరస్వామి తెలిపిన వివరాలు.. కొందరు వేటగాళ్లు వేటకు వెళ్తున్నారన్న సమాచారంతో బైర్లూటి రేంజ్ అటవీ సిబ్బంది నిఘా ఉంచారు. సమీపంలో తుపాకి శబ్దం వినిపించడంతో అప్రమత్తమై గాలించగా ఎస్‌బీఎంల్ నాటు తుపాకీ, బ్యాటరీ లైటు, హారన్‌లతో ఇద్దరు పారిపోతుండగా వెంకటాపురం గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలుడు చిక్కాడు. ప్రధాన నిందితుడు సత్యమయ్య పారారయ్యాడు. బాలుడిని అరెస్టు చేసి తుపాకీతో పాటు సత్యమయ్య ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని కర్నూలు జువైనల్ కోర్టులో హాజరు పరచగా జువైనల్ హోంకు తరలించారు.

కలప మొద్దులు మాయం!

- కింగ్ మార్కెట్ హైస్కూల్ హెచ్ఎంపై ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్



ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల



పైకప్పు నుంచి కలప మొద్దులు తొలగించిన దృశ్యం

కర్నూలు సిటీ: నగరంలోని కింగ్ మార్కెట్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కలప మొద్దులు మాయమయ్యాయి. ఈ విషయంపై నగరపాలక కమిషనర్ ..జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజనకు ఫిర్యాదు చేయగా ఆమె విచారణకు ఆదేశించారు. కింగ్ మార్కెట్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను 1915 సంవత్సరంలో నిర్మించారు. ఈ పాఠశాలలో సుమారుగా ఏడు వందల మందికిపైగా చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు తరగతి గదులు లేకపోవడంతో మన బడి నాడు–నేడు పథకం కింద రూ.1.04 కోట్లకు అంచనాలు వేయగా, రూ.95,99,000కు పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఇందులో రూ.32,55,000 ఖర్చయ్యాయి. ఈ నిధులతో స్కూల్ ఆవరణంలోని బ్రిటీష్ కాలం నాటి కట్టడం షెడ్డు పైభాగం తొలగించి స్లాబ్ వేసి, స్కూల్‌లో టాయిలెట్లు, మిగిలిన గదులకు మరమ్మతులు చేశారు.

విలువైన కలప ఎక్కడ?

కింగ్ మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు జూన్ 9వ తేదీ వరకు హెచ్‌ఎంగా ఎస్.సువర్ణ సునీయం పని చేశారు. ఈమె హయాంలో రూ.32,55,000 నిధులను నాడు–నేడుకు ఖర్చు చేశారు. జూన్ నెలలో ఎంఈఓగా పదోన్నతిపై పెద్దకడబూరుకు వెళ్లిపోయారు. ఆ తరువాత శుక్ర్ నాయక్ హెచ్‌ఎంగా వచ్చారు. ఈయన నుంచి జూలై 3న రెగ్యులర్ హెచ్‌ఎంగా మౌలాలి బాధ్యతలు తీసుకున్నారు. నాడు–నేడు బాధ్యతలు తీసుకోకుండా తాను డిప్యూటీ డీఈఓగా వెళ్తున్నానని, ఆ బాధ్యతలు కూడా తీసుకోలేదు. ఆగస్టులో పాఠశాల పాత భవనాల పైకప్పులను తొలగించారు. అందులో ఉన్న విలువైన కలప మొద్దులను స్కూల్ కమిటీ వాళ్లతో కలిసి అయినవారికి కట్టబెట్టి, పనికి రాని చెక్కలను అక్కడే వదిలేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విలువైన కలప మొద్దులు మాయం కావడంతో హెచ్‌ఎం మౌలాలి తీరుపై కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ గత నెల 13న కలెక్టర్ జి.సృజనకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర శిక్ష అధికారులను విచారణకు ఆదేశించారు. విచారణలో కలప మొద్దులు మాయం అయినట్లు గుర్తించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి పనులు మరో ఏజెన్సీకి అప్పగించేందుకు ప్రస్తుతం పనులు నిలిపి వేశారు. హెచ్‌ఎం మౌలాలిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ మరోసారి సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై కర్నూలు డిప్యూటీ డీఈఓతో కలిసి హెచ్‌ఎం మౌలాలి రాజీకి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.